# ప్రశ్నలు & సమాధానాలు

## ప్రశ్న 352, మాయను తొలగించడం ఎలా?

**మార్చి 13, 2025**

ఈ ఉద్ధరణ ప్రొ. అనిల్ కుమార్ గారి *Seeking Within,* పేజీలు *122-131* నుండి తీసికొనబడినవి.

ప్రొ. అనిల్ కుమార్ గారు భగవాన్ బాబా వారి సందేశము, ఉపదేశములను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పడానికి ఎంపిక చేయబడ్డారు. భారత దేశంలోను, ఇతర దేశాలలోను కూడా విస్తారముగా తిరిగి ఎంతో మంది భక్తులు అడిగిన ప్రశ్నలు, సందేహాలు స్వామి చెప్పిన వాక్కులు, ఉపన్యాసాలను మూలంగా తీసుకొని తేటతెల్లం చేసారు. ముఖ్యంగా ప్రొ. అనిల్ కుమార్ గారు మన సర్వాంతర్యామి సాయిని ఎలా చేరుకోవాలో మార్గం చూపుతారు.

ప్ర: నేను యోగాభ్యాసము నేర్పించే గురువును. భగవంతుడు ఒక్కడే అని తెలుసు. కానీ నాకు కనబడే మనుషులందరూ మిథ్యనా**?** ఇదంతా మాయేనా**?** వాళ్ళు నిజంగా లేరా**?** ఇదంతా ఒక కల అంటారా**?**

జ. ప్రొ. అనిల్ కుమార్: దీనికి జవాబు సులభమే. యోగా అనగా భగవంతుడితో బంధం. యోగా అనగా భగవంతుడిలో లీనమవడమే. కనుక మీరు భగవంతుడిలో లీనమైపోయినప్పుడు ఏకత్వాన్ని అనుభవిస్తారు. అద్వైతాన్ని అనుభవిస్తారు. ఎక్కడ చూసినా భగవంతుడే కనిపిస్తాడు - జంతువులలో, వృక్షాలలో, లోహపదార్థములలో కూడా. ఎక్కడున్నా భగవంతుడిని అనుభవిస్తారు. దారిలో చచ్చి, కుళ్ళిన కుక్క కనిపించినప్పుడు అందరూ "దానిని కాల్చివేయండి! పారవేయండి!" అంటుంటే యేసు క్రీస్తు "దాని పళ్ళు ఎంత తెల్లగా ఉన్నాయి! ఈ చచ్చిన కుక్క పళ్ళు ఎంత మెరిసిపోతున్నాయి!" అన్నారు.

అంటే మీకు ఎంతటి చెడ్డదానిలోనైనా మంచి కనబడుతుంది. నిజమైన యోగమార్గములో భిన్నత్వంలో ఏకత్వం కనిపిస్తుంది. యోగా ఏకత్వాన్ని ప్రసాదిస్తుంది. కానీ వ్యావహారిక జీవితంలో అంతా ఏకంగా ఉంటామని అర్థం కాదు! వ్యావహారిక జీవితంలో భిన్నత్వం ఉంటుంది.

ఒక విద్యార్థి నా దగ్గరకు వచ్చి, "సర్, నాకు పాఠం చెప్పండి" అంటే "నువ్వు దేవుడు, నేను దేవుడు. కనుక ఈరోజు పాఠం లేదు" అని చెప్పలేను కదా! ఒక రోగి వైద్యుని దగ్గరకు వెళ్ళి, "సర్, నాకు విపరీతమైన నొప్పి ఉంది" అంటే "నువ్వు రోగి కాదు, నేను వైద్యుణ్ణి కాదు. నువ్వు దేవుడవే, నేను కూడా దేవుడనే, కనుక ఆపరేషన్ అక్కరలేదు" అని అంటాడా?

సిద్ధాంతం ప్రకారం ఏకత్వం అనుభవిద్దాం. ఆధ్యాత్మికంగా ఏకత్వం అనుభవిద్దాం. భౌతికంగా భిన్నత్వం అనుభవిద్దాం. వాడుకలో, వాస్తవంలో అది అవసరం. ఇదే మీకు నేనివ్వగల జవాబు.

ప్ర**:** స్వామికి మన గురించి అంతా తెలిసియున్నప్పుడు నిన్నటి దివ్యోపన్యాసంలో అక్కడున్న అబ్బాయి గురించి మిమ్మల్ని ఎందుకు అడిగారు**?**

జ. ప్రో. అనిల్ కుమార్: ఓహో! మంచి ప్రశ్న! నిన్న చూసిన దాని గురించి అడుగుతున్నారు, మంచిది! అప్పుడప్పుడు ఇటువంటి ప్రశ్నలు వస్తుంటాయి. ఈ సందర్భానికి తగ్గ ఒక ఉపమానం చెప్తాను.

స్వామి మీ దగ్గరకు వచ్చి "ఎప్పుడు వచ్చావు?" అని అడిగితే ఆయనకు తెలియదా? అదే స్వామి "నా అనుమతి లేకుండా ఎవ్వరూ ఇక్కడ అడుగు పెట్టలేరు" అని కూడా అన్నారు. అలాంటప్పుడు "ఎప్పుడు వచ్చావు?" అని ఎందుకు అడుగుతారు?

రెండవ ఉదంతం: స్టేజి మీద కార్యక్రమం జరుగుతుండగా ఆయన అక్కడే ఉన్నారు. నా వైపు తిరిగి "నీ టిఫిన్ ఎలా ఉంది?" అని అడిగారు. "బావుంది స్వామి," అన్నాను. (అదో దివ్య ప్రేమాయణం అనుకోండి!) నేను ఇంకా టిఫిన్ తినలేదని ఆయనకు తెలియదా? ఎందుకన్నారు అలా?

మిత్రులారా, భగవంతుడు మనతో సంబంధం పెట్టుకోవడానికి అటువంటి ప్రశ్నలు అడుగుతాడు. ఆయనకు అన్నీ తెలుసు కనుక అసలు మీతో మాట్లాడకపోతే ఎలా? ఆయనకు అంతా తెలుసు కనుక ఎందుకు మాట్లాడాలి మీతో?

అలా కాదు. ఆయనతో సంభాషించే ఆనందం మీకు ఇవ్వడానికి, ఆయనకు దగ్గరగా ఉన్న ఆనందం ఇవ్వడానికి, ఆయనకు దగ్గరగా ఉండడంలో వచ్చే పులకరింత అనుభవించడానికి, మనల్ని "టిఫిన్ ఏమి తిన్నావు?" అని అడుగుతారు.

"ఓ! ఎలా ఉన్నావు? నీ డ్రెస్ బావుంది! నీ ఉద్యోగం ఎలా ఉంది?" అని. అప్పుడు మనం ఉత్సాహంతో జవాబు చెప్తాం.

కనుక స్వామి నిన్నటి దివ్యోపన్యాసంలో ఒక అబ్బాయి పేరు అడిగిన సంఘటన ఈరోజు మీరు ఈ ప్రశ్న అడగడానికి దారి తీస్తుంది కనుక అలా అడిగారు. ఈ జవాబు అందరికీ సహకరిస్తుంది.

ప్ర: మాయ యొక్క మూలం ఏమిటి? ఎక్కడ ఉంటుంది?

జ. ప్రో. అనిల్ కుమార్: ఎవరో ఒకరు అన్నారట, "స్వామి, ఈ మాయతో బాధలు పడలేకపోతున్నాను. నాకింక వద్దు. ఈ మాయను తప్పించుకొనే లాగ చేయండి స్వామి!" అని.

బాబా వెంటనే, "మాయ నొప్పిగా ఉందా? మాయ నిన్ను బాధ పెడుతుందా? మాయ ఎక్కడ ఉందో చూపించు" అన్నారట.

ఈ మాయ పెట్టే బాధలకి దానిని చంపివేయాలని ఉంటుంది మనకు. "ఈ మాయ నన్ను చంపేస్తుంది. ఇంతటి బాధలు పెట్టే మాయ అసలు ఉండకూడదు. దానిని చంపేద్దాం" అనుకుంటాం.

ఇక్కడ మన అనుభవాన్ని గమనిద్దాం. స్వామి ఇటు వస్తున్నారని అనుకుంటాం కానీ ఆయన అటు వెళ్తారు. స్వామి స్టేడియంకి వెళ్తారనుకుంటాం కానీ ఇంటర్వ్యూ గదికి వెళ్తారు. ఆయన చేసే పనులు మనం

ముందే ఊహించలేము. ఆయన మనను మాయ చేస్తారు. కానీ ఆయనను అలా అనుభవించడం ఆనందంతో కూడినది కూడా. పరుగెత్తుకెళ్ళి చూస్తే ఆయన కారు ఇంకొక వైపు వెళ్తూ కనిపిస్తుంది. పోలీసు వారికి కూడా తెలీదు స్వామి ఎక్కడికి వెళ్తున్నారో. కొన్నిసార్లు నన్ను అడుగుతారు, "స్వామి ఎక్కడికి వెళ్తున్నారు?" అని. "మీరు కనుక్కొని నాకు చెప్పండి!" అని జవాబు చెప్తాను నేను.

కనుక మాయ భగవంతుడి ఆధీనంలో ఉంటుంది. మన ఆధీనంలో ఉండదు. మునుగుతున్న మనిషి ఇంకొక మనిషిని రక్షించలేడు. అతనే మునిగిపోతుంటే ఇంకొకడిని ఎలా రక్షిస్తాడు? అసాధ్యం! ఒక గ్రుడ్డివాడు ఇంకొక గ్రుడ్డివాడికి దారి చూపలేడు. ఇద్దరూ గ్రుడ్డివాళ్ళే.

కనుక మాయను తీసివేయడం సాధ్యం కాదు. ఒకరు తీసివేయలేరు. భగవంతుని అనుగ్రహం మాత్రమే తీసివేయగలదు. ఈ మాయ అనే వస్త్రం భగవంతుడు ధరిస్తాడు కనుక ఆయనకు మాధవుడు అని పేరు.

ప్ర**:** మాయ దైవాధీనంలో ఉన్నప్పుడు దాని నుండి ఎలా తప్పించుకోగలను**?**

జ**.** ప్రొ**.** అనిల్ కుమార్**:** ఎలా తప్పించుకోవచ్చు? అది క్లిష్టమైన ప్రశ్న. మానవాధీనంలో ఉన్న బాధలనే తప్పించుకోలేనప్పుడు దైవాధీనంలో ఉన్న మాయను ఎలా తప్పించుకోవడం?

తప్పకుండా భగవంతుడి అనుగ్రహంతో మాయ తప్పించుకోవచ్చు. దీనికి బాబా ఒక ఉదాహరణ చెప్పారు. మీరు ఒక ధనవంతుడి ఇంటికి వెళ్ళినప్పుడు ఆ ఇంట్లో ఎంతో ఆస్తి, ధనము ఉంటాయి. సహజంగా ధనవంతుల ఇళ్ళల్లో ఆల్సేషన్ కుక్కలు కానీ బుల్ డాగ్స్ కానీ ఉంటాయి. "కుక్కలు జాగ్రత్త!" అని బోర్డులు కూడా ఉంటాయి. ఆ కుక్కలు నీ మీద ఎగరడానికి సిద్ధంగా ఉంటాయి. అప్పుడు ఏమి చేయాలి? పరిగెడితే నీ వెనుక పడతాయి. అక్కడే నిలబడితే భయం వేస్తుంది. వణుకు వస్తుంది. అప్పుడు ఏమి చేయాలి?

"ఓ మిత్రుడా! ఎక్కడున్నావు? నిన్ను చూడడానికి వచ్చాను. కానీ నిన్ను చూడడానికి బదులు నీ కుక్కని చూడవలసి వస్తుంది. నీ కుక్కని చూడడానికి రాలేదు నేను! నిన్ను చూడడానికి వచ్చాను" అని గట్టిగా అరువు.

అలా గట్టిగా అరిస్తే నీ మిత్రుడు క్రిందకి వస్తాడు. ఆ ధనవంతుడు క్రిందకి వచ్చి ఆ కుక్కని వెనక్కి పంపించేస్తాడు. అది వెళ్ళిపోగానే నీ మిత్రుడితో లోనికి వెళ్ళవచ్చు.

అదే విధంగా భగవంతుడు యజమాని. మాయ అనేది ఆయన కుక్క వంటిది. యజమాని చెప్తే మాయ వెళ్ళిపోతుంది. కానీ నువ్వు చెప్తే వెళ్ళదు. నీ పైన, నీ చుట్టూ, నీ వెనుక పడుతుంది. వీలైతే నిన్ను కరుస్తుంది కూడా! అరవడమే మార్గం.

అలా అరవమని బాబా చెప్తారు - అనగా నామస్మరణ చేయమని.

మాయా మానుష వేష
కేశవా మాధవా జయదేవా మధుసూదనా

మాయా మానుష వేష లీలాధర

"ఆయన సహాయం కొరకు అరచినప్పుడు సహజంగానే మాయ వెళ్ళిపోతుంది. మాయ వల్ల బాధ అనుభవించక్కరలేదు" అని బాబా చెప్పారు.

వచ్చే వారం మరిన్ని దివ్య సందేశాలు తెలుసుకుందాం. ధన్యవాదములు.

ఓం సాయి రామ్